# ఆకలి

ఎండ మాడుతోంది. తారురోడ్డు మీద కాళ్ళు అంటుకుపోతున్నాయి. రెండు రోజులుగా తిండిలేక రామారావుకు ప్రాణం తడబడుతోంది అడుగు ముందుకు వెయ్యలేకపోతున్నాడు. అయినా ఆ ఎండలో ఆగనూ లేక భారంగా ముందుకు సాగుతున్నాడు. ఆకలి దహించివేస్తుంది. ఆ ఆకలికి ముందూ వెనకా, మంచీ చెడూ ఏమీ తెలియటంలేదు. ఆకూ, అలము చెట్టూ, చేమ ఏదయినా సరే, కబళించివేద్దామన్నంత తపనగా వుంది. మెదడులో ఒక్కటే ఆలోచన మెదలుతోంది. ఎవరయినా పిలిచి విస్తరి వేసి పట్టెడన్నం పెడతారా? దిక్కులు చూస్తూ ముందుకు సాగాడు. ఇంక నడవడానికి కళ్ళు తిరుగుతున్నాయి. ఇంక కాస్త సాగితే నీరసించి పడిపోవచ్చు. ఎక్కడయినా కాస్సేపు కూర్చుంటే? ఎదురుగా ఉన్న ఇంటి అరుగు ఆకర్షించింది. అరుగు ఎత్తుగా విశాలంగా ఉంది. లోపల ఉన్న బాదంచెట్టు నీడ ఓమూల కొద్దిగా పడుతోంది. నిస్త్రాణగా వెళ్ళి అక్కడ కూర్చున్నాడు. చొక్కాతో ముఖం తుడుచుకున్నాడు. కాస్త ప్రాణం కోలుకుంటూన్నట్లనిపించింది.

లోపల సందడిగా ఉంది. ఏదో పండగ జరుగుతూన్నట్లుంది. గొడవగా గోలగా ఉంది. అందరూ ఏవో సందడిగా మాట్లాడుకుంటున్నారు. పిల్లలు అరుస్తూ ఆడుకుంటున్నారు. ఏదో విందు జరుగబోతూన్నట్లుంది. ఈ పూట ఇక్కడ భోజనం దొరుకుతుందా? ఎవరయినా తనని పిలిచి అన్నం పెడితే? ఆశతో లోపలికి తొంగిచూశాడు.

"ఎవరది?" ఎవరో గట్టిగా అరిచారు. ఒక వ్యక్తి బయటికి వచ్చాడు. అతన్ని చూసి ఆశ్చర్యంగా గొంతు తగ్గించి "నువ్వట్రా"

అన్నాడు. రామారావు తెల్లబోయి కొస్త తేరుకుని నిదానంగా చూశాడు. ఒకప్పుడు తన సహాధ్యాయి మధుసూదనరావు. ఇప్పుడీస్థితిలో అతనికంట బడటం తనకెంతో అవమానంగా వుంది. దుమ్ము నిండిన బట్టలు, నీరసించిన శరీరం, నోరుతెరచి అన్నం అడుగవలసిన దైన్యం! కొయ్యబారి నోట మాటలేక వూరుకున్నాడు. అతను మళ్ళా అడిగాడు "ఎందుకురా ఇలా వచ్చావ్?"

కొస్త తేరుకుని రామారావు సమాధానం చెప్పాడు నీరసంగా "ఎండగా వుంది కాస్సేపు కూర్చుంటాను."

మధు "సరే" అన్నాడు. నిర్లిప్తంగా లోపలకి వెళ్ళిపోతున్నాడు. "ఒరేయ్!" అన్నాడు రామారావు సగం చచ్చి. మధు వెనక్కి తిరిగి చూశాడు. "ఏం రా?" అన్నాడు.

రామారావు బిక్కమొహంతో అన్నాడు "ఈపూట ఇక్కడ భోజనం పెట్టిస్తావా?" ఆశతో అతని కళ్ళు ఒక్కక్షణం తళతళా మెరిశాయి. మధు ముఖం తెలతెలాపోయింది. సందేహంగా అన్నాడు. "ఏమోరా, ఇది మా యిల్లు కాదు. వీళ్ళు మాకు తెలిసినవాళ్ళు. నేనూ ఇక్కడికి అతిథిగా భోజనానికి వచ్చాను. ఈ ఇల్లుగలాయనకు కొత్తగా పాప పుట్టింది. ఇవ్వాళ బారసాల జరుగుతోంది. ఇంకా విందు భోజనాలవలేదు."

రామారావు ముఖం నిరాశతోనిండింది. మధు మళ్ళా అన్నాడు. "అయినా కాసేపు కూర్చో. వీలుచూసి మళ్ళా చెబుతాను" అంటూ లోపలికి వెళ్ళిపోయాడు. రామారావులో మళ్ళా కొస్త ఆశ మొలకెత్తింది. అన్నం పెడతారేమోనన్న ఆశ కలగ్గానే ఆకలి రెండింతలై భరించలేనంతయింది. తట్టుకోలేని తపనపడుతూ గోడకు జార్లబడి కూర్చున్నాడు.

ఏవో ఆలోచనలు సాగుతున్నాయి. తను పట్టభద్రుడై మూడే

ళ్ళయింది. మూడేళ్ళుగా వుద్యోగం కోసం ప్రయత్నిస్తున్నాడు. ఎక్కడా దొరికే అవకాశం కనబడలేదు. తిరిగి తిరిగి ఉన్నది కాస్త ఖర్చు కావడం, మనస్సు శిథిలంకావడం మిగులుతోంది. ఇంట్లో ముసలి తల్లి, తనూ తప్ప ఇంకెవరూ లేరు. తండ్రి చిన్నప్పుడే పోయాడు. ఉన్న రెండు ఎకరాలు అమ్మి తల్లి తనకు చదువు చెప్పించింది. అందరితో తన బాధ్యత తీరినట్లు, ఇక భారమంతా రామారావుదే అన్నట్లు, కాళ్ళుచాపుకు కూర్చుంది. అవును అంతకన్నా ఆమె ఏం చేస్తుంది? ఇంక పోషణభారమంతా తనదే. తనూ శాయశక్తులా ప్రయత్నిస్తున్నాడు. ఎక్కడయినా జవానుపనైనా దొరికితే చేద్దామని. కాని ఏం లాభం? అది కూడా యిప్పించేవాళ్లు లేరు. తనకు బంధు వర్గంలో ఎవరూ వుద్యోగస్థులు లేరు. ఆదుకునేవాళ్లు లేరు. ఈలోగా ఇంట్లో ఒక్కొక్క వస్తువూ అమ్ముకు తినటమవుతోంది. గిన్నెలు గరిటలు కూడా కంటికి కనిపించకుండా పోతున్నాయి. మొన్న రెండురోజులు బియ్యం లేక అమ్మ చిలకడదుంపలు వుడకబెట్టి పెట్టింది. అవి ఒకరోజు తిన్నాడు. కడుపునొప్పి వచ్చింది. మళ్ళా నయించలేదు. అప్పుడెప్పుడో కందమూలాలు మాత్రం తిని మరి మహర్షులంతా ఎలా సంతోషంగా తృప్తిగా బ్రతికారో? తనకు ఆ దుంపలు సరిపడలేదు. ఇంట్లో వుండి వూరికే అమ్మ పడే బాధ చూడలేక, ఏమీచెయ్యలేక రెండు రోజులుగా ఇల్లు వదిలిపెట్టి తిరుగుతున్నాడు. తిండిలేక నిద్ర లేక ప్రాణం కడబట్టింది.

ఎవరో పచ్చి వీధితలుపు వేశారు. లోపల వడ్డన జరుగుతోంది భోజనాలు చేస్తున్నట్టున్నారు. వంటల వాసన వాకిట్లోకి వస్తోంది. రామారావుకు ఆకలి ఎక్కువై తపన ఎక్కువయింది. అలా అందరూ ఆనందంగా లోపల భోంచేస్తూవుంటే తాను ఒక్కడూ అలా ఎవరైనా తన్ను కూడా భోజనానికి పిలుస్తారేమోనని ఆశపడుతూ ఎదురుచూస్తూ కూర్చోటం ఏదో అవమానంగా, చిన్నతనంగా ఉంది. అతన్ని ఎవరూ

పిలవలేదు. కాస్సేపటికి భోజనాలు పూర్తయాయి. కాస్త సద్దుమణిగింది. అందరూ తాంబూలాలు సేవిస్తూ కాస్త మౌనంగా భుక్తాయాసం తీర్చుకుంటున్నారు కాబోలు! ఎవరో వచ్చి ఎంగిలాకులు బైట పడవేసి వెళ్ళారు. వాకిలి అంతా మురికిగా వుంది. ఇంక ఆ అరుగుమీద కూర్చోటానికి అసహ్యంగా వుంది. ఎంతకూ తన స్నేహితుడు మళ్ళా బయటకు రాలేదు. చాలా సేపు ఎదురుచూసి ఆగలేక తానే లేచి నీరసంగా లోపలకు ఒక్క అడుగు వేశాడు. అడుగుపెట్టగానే ఎవరో కర్కశంగా ఒక్క అరుపు అరచారు. "ఎవరు నువ్వు?" అని. అతనికేం మాట్లాడాలో తెలియలేదు. తడబడుతూ అన్నాడు. "మధు భోజనం పెట్టిస్తానన్నాడు" అని. ఆ వ్యక్తి ఎవరో మళ్ళా అరచాడు. "ఇప్పుడేమి భోజనం! ఇక్కడ అందరి భోజనాలు అయినాయి. ఇప్పుడేం లేవు వెళ్లు" అని. రామారావుకు గొంతులో వుండ చుట్టినట్లయింది. మాటరాలేదు. మధు లోపల ఎక్కడ వున్నాడో? అతని కోసం ఎదురుచూడాలని కూడ తోచలేదు. నిస్పృహతో బయటకు వచ్చి తోవపట్టాడు. నీరసంగా అడుగులు వేస్తూ ముందుకు సాగాడు. పరాయి ఇంటిముందు పట్టెడన్నం కోసం ప్రాధేయపడి నిస్పృహ, అవమానము పొందిన తన పేదరికానికి మనసు కుమిలింది. కళ్ళల్లో నీరు తిరిగింది.

కాస్త దూరంలో ఒక మర్రిచెట్టు వుంది. క్రింద నీడ విశాలంగా, చల్లగా వుంది. అక్కడికి వెళ్ళి చతికిలబడ్డాడు. ఆ చెట్టు కింద, ఆ ఎండలో ఓ ముసలిది కూర్చుని ఉంది. జుట్టంతా నెరసిపోయి చింపిరి చింపిరిగా వుంది. ఒక పన్నైనా వుందో లేదో ఒట్టి బోసినోరు. ఒళ్ళంతా చర్మం వడిలి పోయి ముడతలు పడిఉంది. ముందర ఒక గోనెసంచి మీద అరటిపళ్ళు రెండేసి రెండేసి కుప్పలుగా పేర్చింది. అవి అమ్ముతుంది కాబోలు? ఆపళ్లు నల్లగా వాడిపోయి వున్నాయి. అయినా అవి కొనుక్కోవాలన్నా తన దగ్గర

దమ్మిడీ లేదు. అతన్ని చూసి అవ్వ అడిగింది, "ఒళ్ళు బాగాలేదా?" అని. అతనన్నాడు: "అదికాదు ఆకలి వేస్తూంది" అని. ఆమె రెండు పళ్ళు తీసి చెయ్యి ముందుకు చాపింది. "ఇవిగో ఇవి తిను" అన్నది ఆప్యాయంగా. అతను పళ్ళందుకున్నాడు. సందేహిస్తూ అన్నాడు "నాదగ్గర డబ్బు లేదు." ఆమె లక్ష్యపెట్టలేదు. నిర్లక్ష్యంగా అన్నది. "పోనీవ్. మళ్ళా ఇద్దువులే" అతను ఆపళ్ళు తిన్నాడు కాస్త ప్రాణం కుదుటబడింది. అవ్వ తనపక్కనున్న చెంబుతో నీళ్ళు యిచ్చింది. అతను తాగాడు గడగడా ఎన్నడూ నీళ్ళ రుచి ఎరగనట్లు! అతను అన్నాడు "మళ్ళా వస్తాను. నీ డబ్బులు తెస్తాను" అని. ఆమె ఆప్యాయంగా నవ్వింది. అతనికి అప్పు డప్పుడు తన తల్లి తనకేసి ఆప్యాయంగా ప్రేమగా చూడటం గుర్తు వచ్చింది. మెల్లగా లేచి వెళ్ళిపోయాడు, మనస్సులోనే అవ్వకి నమస్క రించుకుంటూ!

• • •

అది జరిగి ఏడాదయింది. ఆ తరువాత అతనికి వుద్యోగం దొరి కింది. వందరూపాయల జీతం. ఇప్పుడు ఉపవాసాలు చెయ్యనక్కరలేదు. ఆకలితో అలమటించనక్కర లేదు. వచ్చే జీతం ఒక్కపూట భోజనానికి సరిపోతుంది. పోషించవలసినవాళ్ళు లేరు. తల్లి పోయింది. తాను ఒక్కడూ! ఏదో పగలంతా పనితో సరిపోతుంది. రాత్రి ఒంటరితనంతో ఆలోచనలతో గడుస్తుంది. శరీరానికి ఆకలిబాధ పోయింది. అది ఇంక బాధ పెట్టటంలేదు. కాని మనస్సుకు విపరీతమైన ఆకలి పెరిగింది. అది క్షణం ఊరటనివ్వటంలేదు. ఈ జీవితంలో ఎన్నో రకాల ఆకళ్లు! అన్నం కోసం ఆకలి, స్నేహం కోసం ఆకలి ఒంటరితనం భరించలేక మరొక ప్రాణి కోసం ఆకలి, ఆవేదనలతో శిధిలమయ్యే మనస్సుకు ఆప్యాయత కోసం ఆకలి, ఎన్నిఉన్నా ఏదో రకమైన ఆకలి బాధిస్తూనే వుంటుంది.

కాంతి లేదు. అమ్మ పోయినప్పటి నుంచి అతనిని ఒంటరితనం బాధిస్తోంది. తినడానికి తిండివున్నా, మనస్సుకు వుల్లాసం లేదు. అప్పుడప్పుడు ఆ అరటి పళ్ళిచ్చిన అవ్వ గుర్తుకువస్తుంది. ఆమె కళ్ళల్లో కనిపించిన ఆప్యాయత ఏదో మనస్సుకు చల్లగా ఊరటగా ఉంటుంది.

ఒకరోజు ఆ చెట్టు దగ్గరకు వెళ్ళాడు. ఆమెకు ఆ పళ్ళ ఖరీదు రెండణాలు ఇవ్వాలని ఎన్నాళ్ళగానో అనుకుంటున్నాడు. కాని పడలేదు. ఆవేళ ఆ చెట్టుదగ్గర అవ్వలేదు. ఎవరో చిన్న కుర్రవాడు వున్నాడు. నల్లగా బక్కచిక్కి వున్నాడు. మాసిన చొక్కా, పొట్టిగా పొట్టవాగా వుంది. క్రింది భాగమంతా నగ్నమే! ఒక్కడూ మట్టిలో ఆడుకుంటున్నాడు. రామారావు దగ్గిరగా వెళ్ళి అడిగాడు "ఇక్కడ అరటిపళ్ళు అమ్ముతూ ఓ అవ్వ వుండేది ఏదీ?" అని. ఆ కుర్రాడు తెల్లబోయినట్లు చూశాడు.

"ఏమో తెలవదు" అన్నాడు నిర్లిప్తంగా. రామారావుకు నిరాశ కలిగింది. ఇంత ఊళ్ళో ఇప్పుడా అవ్వను ఎక్కడని వెతికి పట్టుకోవటం? అసలు బ్రతికివుందో లేదో? శాశ్వతంగా ఆ అవ్వకు రెండణాలు బాకీ వుంటాడు కాబోలు! నిస్పృహతో వెనక్కు మళ్ళాడు. ఆ కుర్రాడు దీనంగా పిలిచాడు. "బాబూ." రామారావు ఒక్క క్షణం ఆగి కుర్రాడికేసి చూచాడు.

"బాబూ, ఒక్క అణా ఇయ్యి."

"ఎందుకు" అన్నాడు అతను.

"ఆకలి—"

అతను సంతోషంగా చేతిలో వున్న రెండణాలు ఆ కుర్రాడి చేతిలో పెట్టాడు. ఆ పిల్లవాడి ముఖం వెన్నెల కాంతితో వెలిగింది. వాడి ఆనందానికి అంతులేదు. ఆ క్షణం రామారావుకు అవ్వ బోసినోటితో ఆప్యాయంగా నవ్వుతున్నట్లనిపించింది. అతని మనస్సు తేలికపడింది.